بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ        نَحۡمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوۡلِهِ الۡكَرِيۡمِ        وَعَلٰی عَبۡدِهِ الۡمَسِيۡحِ الۡمَوۡعُوۡدِ

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా**

**బినస్రిహిల్ అజీజ్ ఖుత్బా జుమా సారాంశము - బైతుల్ ఫుతూహ్ లండన్**

**దివి: 14.03.2014** **నజారత్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్ తరపున**

---

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

గత కొన్ని జుమాల ముందు కర్మల సంస్కరణ గురించి పలు ఖుత్బాలు ఇచ్చి యుంటిని. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అల్లాహ్‌ను ఎట్లు ప్రవేశపెట్టెను ? అల్లాహ్ జ్ఞానము, అనురాగమును పొందు మార్గములను వారు మనకు తెలిపిరి, అల్లాహ్ సామీప్యమును పొందుటకు వారెట్లు మార్గదర్శనము చేసిరి ? అటులనే అల్లాహ్ తాజా వాణి, వారి సత్యమునకు అద్భుతాలు, సంకేతములు ఎంత గొప్పగా పూర్తి చేసెనో ప్రస్తావించబడెను. ఈ విషయములు మన విశ్వాసము, కర్మల ప్రగతికి కారణమగుటకు వీటిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం రచనల ద్వారా తెలుసుకొనవలెను.

నేడు నేను అల్లాహ్ జ్ఞానము గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం రచనల, ఆదేశముల ఉదాహరణలను తెలిపెదను. ఈ విషయము గురించే మీ రచనలను ప్రస్తావించినచో వందలాది, లోతుగా చూసినచో వేలాది పుటలు అగును. కాని నేను చెప్పినట్లు ఈ విషయము అనగా అల్లాహ్ జ్ఞానము గురించి పలు వ్యాఖ్యానములను ప్రస్తావింతును.

అల్లాహ్ వద్దకు చేరు మార్గమును సూచించుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లు తెలిపిరి.

"అల్లాహ్ వద్దకు చేరుటకు మానవునికి రెండు విషయములు అవసరం. ఒకటి దుష్కార్యము నుండి దూరముండుట, రెండవది సత్కార్యములు చేయుట. **కేవలం దుష్కార్యమును వీడుట ఘన కార్యము కాదు.** వాస్తవముగా మానవుడు పుట్టినప్పటి నుండి ఈ రెండు శక్తులు అతని స్వభావములో గలవు. ఒక వైపు మనసు కోరికలు అతన్ని దుష్కార్యము వైపు ఆకర్షించగా రెండవ వైపు పొట్టును అగ్ని కాల్చివేయునట్లు అతని స్వభావములో దాగివున్న అల్లాహ్ కాంతి ఆ దుష్కార్య ఆకర్షణను కాల్చివేయును. దుష్కార్యములను కాల్చివేయు ఈ ఆధ్యాత్మిక జ్వాల అల్లాహ్ జ్ఞానముపై ఆధారపడి యుండును. అల్లాహ్ జ్ఞానము వుంటేనే అది ఆహుతి అగును. ఎందుకనగా ఏదైనా విషయమును ప్రేమించుట దాని జ్ఞానముపైనే ఆధారపడియున్నది. ఒక వస్తువు సౌందర్యము, ప్రాముఖ్యత తెలియనిదే మీరు దానిని ప్రేమించలేరు. కావున అల్లాహ్ సౌందర్యము, ప్రాముఖ్యత వలన అతని ప్రేమ ఏర్పడును. ఆ ప్రేమ అగ్నితో దుష్కార్యములు కాలిపోవును. అల్లాహ్ పద్ధతి ప్రకారము ఆ జ్ఞానము సందేశహరుల ద్వారా మానవులకు లభించును. వారి కాంతితో వారు కాంతి పొందుదురు. వారికివ్వబడినదంతయు వారి అనుసరణతో పొందుదురు."

మరల అల్లాహ్ జ్ఞానము, పాపముల నుండి మోక్షము, సత్కార్యముల అనుగ్రహము, దుఆ స్థాయి గురించి హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించిరి.

"అల్లాహ్ కృప, దయతో అతని జ్ఞానము లభించనిదే, అతనితో శక్తి పొందనంతవరకు పాపముతో

పూర్తిగా మోక్షము లభించదు, అల్లాహ్‌తో నిజమైన ప్రేమ కలుగదు, అతనితో భయపడే విధముగా భయపడలేడు. ప్రతి భయము, భక్తి జ్ఞానముతోనే లభించునను విషయము విధితమే. ప్రపంచములోని వస్తువులతో మానవుడు ఆకర్షితమగు, వాటిని కోరు లేదా వాటితో భయపడు, దూరముండు పరిస్థితులు అతనిలో సంపూర్ణ జ్ఞానము తర్వాతనే ఏర్పడును. అల్లాహ్ అనుగ్రహము లేనిదే జ్ఞానము లభించదను విషయము నిజమైనదే. అల్లాహ్ అనుగ్రహము లేనిదే ప్రయోజనము కలుగదు. అనుగ్రహముతోనే జ్ఞానము లభించును. --- మేము ప్రతి రోజు నమాజు చదువుదుము, నమాజ్ మొత్తం దుఆయే కదా అని అపోహపడకుము. ఎందుకనగా అనుగ్రహముతో లభించే జ్ఞానము తర్వాత చేయు దుఆ మరో రకమైనది. అది అంతము చేయు వస్తువు. అది మెత్తగా చేయు అగ్ని. అది కృపను ఆకర్షించు అయస్కాంత శక్తి. తుదకు ప్రాణమిచ్చు మరణమది. అదొక వేగవంతమైన వరద కాని అంతిమముగా నావగా మారును. ప్రతి విరుద్ధమైన విషయము దానితో సానుకూలమగును. ప్రతి విషము దానితో ఔషధమగును. ఇది జ్ఞానవంతమైన స్థానము.

అనేకులు నాలుకతో అల్లాహ్‌ను ఒప్పుకొందురు కాని వెతికినచో వారిలో నాస్తిక బీజములు దర్శనమిచ్చును. ఎందుకనగా ప్రపంచ కార్యములలో నిమగ్నమైనప్పుడు అల్లాహ్ ప్రకోపము, గొప్పదనమును పూర్తిగా మరచిపోవుదురు. కనుక దుఆతో అల్లాహ్ జ్ఞానమును పొందుట అనివార్యము. లేనిచో సంపూర్ణ నమ్మకము ఖచ్చితముగా పొందలేరు. అల్లాహ్‌తో సంబంధము తెంచుకొనుట ఒక మరణమని తెలిసినప్పుడే అది లభించును. పాపము నుండి దూరముండుటకు దుఆతో పాటు ఉపాయాములను వదలకూడదు. ఏ సమావేశములు, సభలలో పాల్గొనినచో పాపపు ఆలోచనలు కలుగునో వాటిని వదులుచు దుఆ కూడ చేయుము.”

దైవ జ్ఞానము లేనిదే పాపముల నుండి దూరముండుట సాధ్యము కాదను విషయమును విపులముగా తెలుపుచు వారిట్లు ఉపదేశించిరి.

“**మానవుడు అల్లాహ్‌ను పూర్తిగా నమ్మినప్పుడే పాపముల నుండి దూరముండు అనుగ్రహము లభించునని గుర్తుంచుకొనుము. పాపపు ప్రభావముతో మోక్షము పొందుటయే మానవ జీవిత ముఖ్య ఉద్దేశము**. ఆసక్తికరముగా కనిపించు ఒక సర్పమును పిల్లలు పట్టుకొనుటకు ఆసక్తి చూపును, చేయి కూడ వేయవచ్చును. కాని సర్పము కాటేసి హతమార్చునని తెలిసిన ఒక వివేకవంతుడు దాని వైపు పోవుటకు సాహసించడు. అంతే కాదు ఏదేని ఒక గృహములో సర్పముందని తెలిసినచో అందులో కూడ ప్రవేశించడు. ప్రాణాంతకమైన విషమును కూడ తినుటకు ధైర్యము చేయడు. ఇటులనే పాపమును తీవ్ర ప్రాణాంతకమైన విషముగా నమ్మనిచో దాని నుండి దూరముండలేడు. ఈ నమ్మకము జ్ఞానము లేనిదే లభించదు.”

మరో చోట వారిట్లు నుడివిరి.

“అల్లాహ్‌ను గుర్తించుట, దైవ శుభముల జ్ఞానమే ధర్మమునకు పునాది. దాని శాఖలు సత్కర్మలు కాగా దాని పుష్పములు ఉత్తమ ప్రవర్తనలు. దాని ఫలములు ఆధ్మాత్మిక అనుగ్రహములు, పోషకుడు అతని దాసుని మధ్య ఏర్పడే అతి సున్నితమైన ప్రేమ. ఆ ఫలముతో లబ్ది పొందుట ఆధ్యాత్మిక పవిత్రత, పరిశుద్ధమైన ఫలితము.”

మరల వారిట్లు ఉపదేశించిరి.

“**సంపూర్ణ ప్రేమ సంపూర్ణ జ్ఞానముతోనే పుట్టును.** జ్ఞాన స్థాయి ప్రకారమే దైవ ప్రేమ ఉవ్విళ్ళూరును. స్వంత ప్రేమ పుట్టినప్పుడే అది నూతన జన్మకు మొదటి రోజు అగును. ఆ ఘడియయే క్రొత్త శకానికి మొదటి ఘడియ అగును.”

మరల వారిట్లు ఉపదేశించిరి.

“అల్లాహ్ ఒక వజ్రము. దాని జ్ఞానము తర్వాత ఇహలోక వస్తువులను అతి నీచము, హీనముగా చూడును. వాటిని చూచుటకు కూడ మనసును బలవంతముగా ఒప్పించవలసి వచ్చును. కనుక దైవజ్ఞానమును కోరుము, అతని వైపే అడుగిడుము, ఇందులోనే సఫలము గలదు.”

మరల ఇట్లనిరి. “మానవుని భక్తి, విశ్వాసము, పరిశుభ్రత అన్నియు ఆకాశము నుండి వచ్చును. దీనిని స్థిరపరచుట లేదా దూరము చేయుట అల్లాహ్ అనుగ్రహముపైనే ఆధారపడియున్నది. మానవుడు తనను తాను శూన్యముగా భావించుట, దైవ ఆస్థానములో మోకరిల్లి వినమ్రతతో అల్లాహ్ అనుగ్రహమును కోరుట, మనస్సు కోరికలను ఆహుతి చేయు జ్ఞాన కాంతిని అడుగుటయే నిజమైన జ్ఞానము. అది లోపల ఒక జ్యోతి, సత్కర్మల శక్తి, వేడిని పుట్టించును. అతని అనుగ్రహములోని కొంత భాగము లభించి, ఎప్పుడైనా సంపూర్ణ స్పష్టత లభించినచో గర్వ పడక, వినమ్రత, నిరాడంబరతలో అభివృద్ధి చెందవలెను. **అతడు ఎంత వరకు వినమ్రత కలిగి యుండునో అదే స్థాయిలో అల్లాహ్ కాంతులు, స్థితిగతులు లబించును.** అవి అతనికి కాంతి, శక్తిని అందించును. మానవుడు ఇటువంటి విశ్వాసము కలిగి యుండినచో దైవానుగ్రహముతో అతని సత్ప్రవర్తన స్థితి మెరుగగును. ప్రపంచములో తనను తాను గొప్పగా భావిచుంట కూడ గర్వమే.”

హుజూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇంకను ఇట్లు ఉపదేశించిరి.

మనము అల్లాహ్‌ను దర్శించినట్లు అల్లాహ్ జ్ఞానము మనలో కలుగు ఈ ఉద్దేశము కొరకే వారు అవతరించిరి. తన ప్రతి కార్యము అల్లాహ్ ప్రేమ అతని భయమును దృష్టిలో వుంచుకొని చేయవలెను. మన పాపములన్నిటిని కాల్చివేయు జ్ఞానము మనకు లభించుగాక! మనము వారి ఉద్దేశము, వారి అవతరణ ఉద్దేశమును పూర్తి చేయువారము గాక! ఈ విషయమములన్నిటిని ఆచరించు, దాని ఉదేద్యమును గ్రహించు అనుగ్రహము అల్లాహ్ మనకు ప్రసాదించుగాక! అమీన్.

☼ ☼ ☼